ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
సోమవారం 7 అక్టోబరు 2024

మళ్లీ 'రెవెన్యూ' యోగం!



తెరపైకి మళ్లీ వీఆర్వో, వీఆర్ఏలకు వ్యవస్థ

- పాత వ్యవస్థను పునరుద్ధరించేందుకు సర్కారు అడుగులు
- పరీక్ష నిర్వహించి తీసుకుంటామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు
- ఆందోళనలో వీఆర్వో, వీఆర్ఏలు
- ఇప్పటికే సీనియారిటీ పోయిందని ఆవేదన

హనుమకొండ టౌన్, అక్టోబరు 6: గతంలో రెవెన్యూశాఖలో కీలకంగా వ్యవహరించి గ్రామాల్లో ప్రతీ ప్రభుత్వ కార్యక్రమానికి అన్నీ తామై నడిపించి ఓ వెలుగు వెలిగిన వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. గ్రామస్థాయిలో రెవెన్యూశాఖను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తిరిగి వారి సేవలను వినియోగించుకోవాలనే ఆలోచన చేస్తోంది. రెవెన్యూశాఖలో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను పునరుద్ధరించి తద్వారా గ్రామస్థాయిలోని రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ప్రభుత్వం ఆలోచనలను స్వాగతిస్తూ వివిధ శాఖల్లో పనిచేస్తున్న వీఆర్వో, కొంత మంది వీఆర్ఏలు మాతృశాఖలో వెళ్లి హాయిగా విధులు నిర్వర్తించుకోవచ్చనే ఉత్సాహంలో ఉన్నారు.

2007 నుంచి వీఆర్వోల ప్రస్థానం

2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు సమయంలో (విలేజ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) వీఏవోలకు అదనంగా గ్రామ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించి వేతనం పెంచారు. 2007లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారిని వీఆర్వోలుగా గుర్తించి గ్రామ రెవెన్యూ బాధ్యతలను అప్పగించారు. అనాటి నుంచి వీఆర్వోలుగా కొనసాగుతూ వస్తున్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ధరణిని తీసుకొచ్చింది. ఈ క్రమంలో రెవెన్యూ శాఖలో జరిగిన అనేక మోసాలు, అవినీతిపై కుప్పలు తెప్పలుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖలోని వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను 2020 సంవత్సరంలో రద్దు చేసింది. వారందరినీ ప్రభుత్వంలోని ఇతర 36 శాఖల్లోకి సర్దుబాటు చేసింది. ఈ విషయంపై వీఆర్వోలు కోర్టుకు వెళ్లగా ఇప్పటికీ తీర్పు రిజర్వులోనే ఉంది.

బదలాయింపుల్లో అన్యాయం

2023 ఆగస్టులో జరిగిన వీఆర్ఏల బదలాయింపుల్లో వారి విద్యార్హతను బట్టి రెవెన్యూతో పాటు మున్సిపాలిటీ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్‌గా, అటెండర్స్‌గా అవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 726 మంది వీఆర్వోలు ఉండగా, 713 మంది వివిధ శాఖల్లోకి జాయిన్ అయి విధులు నిర్వర్తిస్తుండగా 9 మంది మాత్రం వేరే శాఖలోకి వెళ్లకుండా రెవెన్యూశాఖలో ఉండిపోయారు. నిరక్షరాస్యులతోపాటు వయస్సు పైబడిన వారిని రెవెన్యూశాఖలోనే కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వయస్సు పైబడటంతో వాళ్లంతా పిల్లలకు వారసత్వ ఉద్యోగాల ఇవ్వాలని ఎదురుచూస్తున్నారు.

సర్వీసు కోల్పోయి పదోన్నతులకు దూరం

వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడంతో వారందరినీ ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేయగా, జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఆయా శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే రెవెన్యూశాఖలో కొన్నేళ్లుగా పని చేసినప్పటికీ వారందరూ ఆయా శాఖల్లో జీరో సర్వీసు నుంచి ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టారు. రెండేళ్ల ప్రొహిబిషన్ కాలవ్యవధి తర్వాత ఇటీవలే వారి రెగ్యుల రైజేషన్ మొదలైంది. దీంతో పదిహేను, పదహారు యేళ్ల నుంచి చేసిన సర్వీసు అంతా వృథా అయిపోయింది. కొద్దిరోజుల్లో వీఆర్వో నుంచి సీనియర్ అసిస్టెంట్స్‌గా పదోన్నతులు పొందుతారన్న తరుణంలో గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దుచేయడంతో అర్హత ఉన్న వారంతా సర్వీసులను కోల్పోయి పదోన్నతులకు దూరమయ్యారు.

మంత్రి వ్యాఖ్యలతో అందోళన

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ పునరుద్ధరణపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలతో వీఆర్వోలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వీఆర్వో, వీఆర్ఏల నియామకాలకు సంబంధించి అభ్యర్థుల సామర్థ్యాలను పరీక్షించడానికి పరీక్ష నిర్వహిస్తామని, రెవెన్యూ సర్వీసులోకి రావాలంటే పరీక్ష రాయాల్సిందేనని స్పష్టం చేయడంతో ఇప్పటి వరకు నూతన ఉత్తేజంతో ఉన్న వీఆర్వోలు ఆందోళనకు గురవుతున్నారు.

సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలి..

- సర్వేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ రెవెన్యూశాఖ



వీఆర్ఏగా రెవెన్యూశాఖలో 16 యేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాను. 2020లో మా సహచరులంతా ఇతరశాఖలకు వెళ్లినప్పటికీ నేను మాత్రం మాతృశాఖలోనే ఉండిపోయాను. కొన్నేళ్లుగా రెవెన్యూశాఖలో విధులు నిర్వర్తించిన వీఆర్వోలు అంతా వేరే శాఖల్లో చేరి జీరో సర్వీసుతో కొనసాగుతున్నారు. రెవెన్యూ శాఖలోకి ప్రభుత్వం రీపోస్టింగ్ ఇచ్చినా, ఇవ్వకున్నా.. ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ సర్వీసును పరిగణలోకి తీసుకొని వీఆర్వో, వీఆర్ఏలకు న్యాయం జరిగేలా చూడాలి.

మా ఉద్యోగాలు మాకు ఇవ్వడానికి పరీక్షలు ఎందుకు?

- రాజయ్య, జూనియర్ అసిస్టెంట్, విద్యాశాఖ



సుంకరి నుంచి వీఆర్వో వరకు కొన్నేళ్లుగా రెవెన్యూ శాఖలో పనిచేశాను. ఆకస్మాత్తుగా వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి ఇతరశాఖలకు పంపించారు. అక్కడ సర్వీసుల్లో జూనియర్స్ అయ్యాం. చాలాకాలంగా రెవెన్యూ వ్యవస్థలో పనిచేశాం కాబట్టి మమ్మల్ని తీసుకుంటే ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. పరీక్ష పేరుతో మమ్మల్ని రెవెన్యూశాకు దూరం చేయాలనకుంటే ప్రభుత్వానికే నష్టం జరుగుతుంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న సర్వీసు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి.

అన్నాచెల్లెళ్లు పంతుళ్లవుతున్నారు..!


తల్లి పద్మతో మౌనిక, మహేశ్ కుమార్

బచ్చన్నపేట, అక్టోబరు 6: కన్న తండ్రి 18 ఏళ్ల క్రితమే కాలం చేశాడు. రెక్కాడితేగాని డొక్క నిండని కుటుంబం వారిది. ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తల్లి బీడీలు చుట్టి వచ్చిన డబ్బులతో పిల్లల పొట్ట నింపుతూ చదివించింది. తమ తల్లి పడుతున్న కష్టాన్ని చూసి ఎలాగైనా తమ కుటుంబం మంచి స్థితికి తీసుకురావాలని ఆ అన్నాచెల్లెళ్లలో చిన్నప్పటి నుంచి పట్టుదల పెరిగింది. ఇందుకు బాగా చదువుకోవడమే ఏకైక మార్గమని భావించారు. కసితో చదివారు. డీఎస్సీ రాసి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కన్నతల్లి కళ్లల్లో ఆనందాన్ని చూశారు. బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన బల్ల సోమయ్య-పద్మ దంపతులకు కుమారుడు మహేశ్‌కుమార్, కూతురు మౌనికలున్నారు. సోమయ్య 18 ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోగా, పద్మ పిల్లల కడుపు నింపేందుకు బీడీలు చుట్టేది. వచ్చిన కొద్దిపాటి డబ్బుతో చదివించింది. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి వరకు చదివా రు. ఇంటర్ జనగామలో, ఉన్నత చదువులు నిజాం, ఉస్మానియాలో పూర్తి చేశారు. ప్రభుత్వం డీఎస్సీ వేయడంతో పరీక్ష రాశారు.

ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో జిల్లా స్థాయి ఎస్జీటీ విభాగంలో మహేశ్‌కు 5వ ర్యాంకు, మౌనికకు 15వ ర్యాంకు వచ్చింది. దీంతో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించా రు. ఇన్నాళ్లు తమకోసం కష్టపడి పనిచేసిన తల్లిని బాగా చూసుకుంటామని, పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతుమాని అన్నా చెల్లెళ్లు తెలిపారు.

మెడికల్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ మార్పు

నేటి నుంచి 'కోమటిరెడ్డి సుశీలమ్మ' ఆశ్రమంలో వసతి


కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమం

జనగామ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జనగామ మెడికల్ కాలేజీ విద్యార్థినుల హాస్టల్ మారనుంది. ఇంతకాలంగా జిల్లాకేంద్రంలోని ధర్మకంచ బాలికల వసతి గృహంలో మెడికల్ కాలేజీ విద్యార్థినుల వసతి గృహం కొనసాగగా ఇక నుంచి జనగామ మండలం శామీర్‌పేట శివారులోని కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథ వృద్ధాశ్రమంలో మెడికల్ కాలేజీ విద్యార్థినులకు వసతిని కల్పించనున్నారు. జనగామ మెడికల్ కాలేజీ గత ఏడాది ప్రారంభం కాగా శాశ్వత భవనాలు పూర్తి కాకపోవడంతో తాత్కాలిక భవనాల్లో తరగతులను, వసతి గృహాలను ఏర్పాటు చేశారు. ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో 71 మంది విద్యార్థినులు ఉండగా వీరికి ధర్మకంచ హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేశారు. కాగా.. ఈ ఏడాది నుంచి రెండో సంవత్సరం తరగతులు కూడా ప్రారంభం కావడం, కౌన్సిలింగ్ తర్వాత కొత్తగా మొదటి సంవత్సరంలో మరో 70 మందికి పైగా విద్యార్థినులు రానుండడంతో ధర్మకంచ హాస్టల్‌లో వసతి ఇబ్బందిగా మారనుంది. దీంతో మెడికల్ కాలేజీకి చేరువగా అత్యాధునిక వసతులతో ఉన్న కోమటిరెడ్డి సుశీలమ్మ ఆశ్రమంలో తాత్కాలికంగా వసతి గృహాన్ని నిర్వహించాలని మెడికల్ కాలేజీ అధికారులు భావించారు. ఇందులో భాగంగా ఆశ్రమ నిర్మాణ దాతలైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు కలిసి గర్ల్స్ హాస్టల్‌ను తాత్కాలికంగా నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనితో పాటు వృద్ధాశ్రమ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న సంక్షేమ శాఖ అధికారులకు సైతం లేఖ రాశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు ఇవ్వడంతో హాస్టల్ నిర్వహణకు అడ్డంకులు తొలిగిపోయాయి. మెడికల్ విద్యార్థినులకు వృద్ధాశ్రమంలో వసతి కల్పించడం వల్ల వృద్ధులకు ఆసరాగా ఉంటారని అధికారులు భావించారు. ఇదే క్రమంలో ధర్మకంచ ఎస్సీ బాలికల హాస్టల్ నుంచి నేడు (సోమవారం) కోమటిరెడ్డి సుశీలమ్మ ఆశ్రమానికి గర్ల్స్ హాస్టల్‌ను మార్చనున్నారు.

డీఎస్సీ-2024 ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

జనగామ కల్చరల్, అక్టోబరు 6: డీఎస్సీ-2024 ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినట్లు జనగామ డీఈవో కె.రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లాలో డీఎస్సీ-2024 నియామకంలో భాగంగా స్కూల్ అసిస్టెంట్, భాషోపాధ్యాయ, సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగాల్లో నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులకు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ ఉన్నత పాఠశాలలో జరిగింది. జిల్లాలో 533 మంది అభ్యర్థులను 1:3కి ఎంపిక చేయగా అందులో 517 మంది హాజరయ్యారు. 16 మంది అభ్యర్థులు హాజరుకాలేదు. ధృవపత్రాల పరిశీలన పూర్తయిందని, అందులో నుంచి 1:1 ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తామని డీఈవో తెలిపారు.

తల్లడిల్లిన తల్లి గుండె..

కుమారుడి మృతిని తట్టులేక హఠాన్మరణం

మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరి మృతి



శ్రీనివాస్ (ఫైల్), తల్లి వెంకటమ్మ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6 : కన్నపేగు బంధం తెగడంతో ఆ తల్లి తట్టుకోలకపోయింది. తీవ్ర మనోవేదనకు గురైంది. కుమారుడి మరణాన్ని తట్టుకోలేక జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుల వెంకటమ్మ (74) తీవ్ర మనస్థాపంతో గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలి కుమారుడు ఆకుల శ్రీనివాస్ (55) ఈ నెల 3న అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు హఠాత్తుగా మృతి చెందడంతో అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైన వెంకటమ్మ రెండు రోజులుగా కుమారుడిని గుర్తు చేసుకుంటూ రోదిస్తూ 5వ తేదీ అర్ధరాత్రి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. మూడురోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

పోస్ట్‌మాస్టర్ అదృశ్యం

చిలుపూర్, అక్టోబరు 6 : మండలంలోని లింగంపల్లిలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వేణు అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. మల్కాపూర్‌కు చెందిన నామాల వేణు లింగంపల్లిలో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంటికి చేరిన వేణు తన తోటి స్నేహితులతో కలిసి రాత్రి పదిగంటల దాకా గడిపాడు. వేణు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన ఆయన కుటుంబ సభ్యులు సమీప బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. వేణు సోదరుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

రఘునాథపల్లి, అక్టోబరు 6: పెద్దనాన్న కుమారుడి దశ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన హైదరాబాద్‌లోని కొత్తపేట అంబేద్కర్ నగర్‌కు చెందిన గంగాధరి పవన్(28) అనే యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయి మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మల్లంపల్లి గ్రామంలో దగ్గరి బంధువు గంగాధరి శ్రీనివాస్ దశ దినకర్మకు హాజరయ్యేందుకు వచ్చిన పవన్ కర్మకాండ అనంతరం బంధువులతో కలిసి గ్రామ శివారులో ఉన్న లచ్చుము చెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. స్నానం కోసం వెళ్లిన పవన్ చాలా సేపటి వరకు ఇంటికి రాకపోవడంతో చెరువు వద్దకు వెళ్లి చూడగా, పవన్ ప్యాంటు చెరువులో ఉన్న ముళ్ల కంపకు చిక్కుకొని బయటకు రావడానికి వీలుకాకపోవడంతో ఊపిరి ఆడక నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

తుది ఘట్టానికి కొత్త వీసీ ఎంపిక ప్రక్రియ

ముగ్గురిని ఎంపిక చేసిన సెర్చ్ కమిటీ

ఒక్కరిని ఎంపిక చేయనున్న గవర్నర్

కేయూ క్యాంపస్, అక్టోబరు 6: కాకతీయ యూనివర్సిటీ కొత్త వీసీ ఎంపిక ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర సచివాలయంలో ఆదివారం సెర్చ్ కమిటీ సమావేశమై కేయూ కొత్త బాస్ ఎంపికను ఖరారు చేసింది. కేయూ వీసీకి దరఖాస్తులు చేసిన 158మంది ప్రొఫెసర్లలో వారికున్న అర్హతల మేరకు ముగ్గురి పేర్లను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపారు. వీరి ముగ్గురిలో ఒక్కరిని కేయూ వైస్‌చాన్స్‌లర్‌గా సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు రాష్ట్ర వర్సిటీల చాన్స్‌లర్ అయిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదముద్ర వేసి అధికారికంగా ప్రకటిస్తారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా గుర్తింపు పొందిన కాకతీయ యూనివర్సిటీకి ఈ దఫా కొత్త బాస్ ఎవరు వస్తారనే విషయం హాట్‌టాపిక్‌గా మారింది. వర్సిటీ వాట్సాప్ గ్రూపుల్లోనూ ఫలానా ప్రొఫెసర్ వీసీగా వస్తున్నారని పోస్టులు వెలువడుతున్నాయి. అయితే కేయూలో కీలక పదవిలో కొనసాగుతున్న ప్రొఫెసరే వర్సిటీకి వీసీగా వస్తున్నారని కొందరు.. ఉస్మానియా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ నుంచి వస్తున్నారని మరికొందరు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా గతంలో ఎప్పుడూలేని విధంగా ఈ దఫా వర్సిటీలో కొత్త బాస్‌పై విస్తృతంగా చర్చ సాగుతోంది. అలాగే కాకతీయ యూని వర్సిటీ నుంచి ఒక్కరిద్దరు ప్రొఫెసర్లను రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు వీసీలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తోందనే ప్రచారం తీవ్రస్థాయిలో ఊపందుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో పలు వర్సిటీలల్లో కేయూ నుంచి ఒక్కరిద్దరు ప్రొఫెసర్లు వీసీలుగా పని చేశారు. త్వరలోనే రాష్ట్రంలో పలు వర్సిటీలకు వీసీలను అధికారికంగా ప్రకటిస్తారని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.

మటన్‌కు మస్తు గిరాకీ..!



మేకపోతులు, గొర్రె పొట్టేళ్లకు భారీ డిమాండ్

రద్దీగా మారుతున్న అంగళ్లు

ముందస్తుగానే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, ప్రజలు

నర్మెట, అక్టోబరు 6 : దసరా పండుగ అంటేనే ప్రతి ఇంట్లో మటన్ ముక్క మందు చుక్క తప్పకుండా ఉండాల్సిందే. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయలు ధరలు, వంట నూనెల ధరలు పెరిగిపోయాయి. దసరా పండుగతో గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు, మేకపోతుల ధరలు కూడా కొండెక్కుతున్నాయి. దసరా పండుగ రోజున. గొర్రెలను, మేకలను కోసి వాటాలు వేయాల్సిందే, మందు తాగి ముక్క తినాల్సిందే. ఇలా ప్రతీ ఒక్కరు పండుగ జరుపుకుంటున్నారు. గ్రామాలు, పట్టణాలలోని వ్యాపారస్తులు దుకాణాదారులు, పెద్ద పెద్ద వాహనాల యజమానులు దసరా పండుగ సందర్భంగా వారి దుకాణాలు, పరిశ్రమలు, వాహనాల ముందు మేకపోతులు, గొర్రెపోతులను బలి ఇవ్వడం ఆనవాయితీ. కాని పెరుగుతున్న గొర్రెల ధరలు కొనుగోలుదారులను నిరాశపరుస్తున్నాయి. దసరా పండుగతో జనగామ జిల్లాలోని సంతలు దసరా పండుగ సందర్భంగా గొర్రెలు, మేకపోతులతో కళకళలాడుతున్నాయి. వ్యాపారులు ముందస్తుగా తక్కువ ధరకు వస్తాయనే ఆశతో వస్తూ ధరలు చూసి తలలు పట్టుకుంటున్నారు. ధరలు ఎక్కువగా ఉండడంతో అమ్మకాలు ఆశాజనకంగా లేవని వ్యాపారులు అంటున్నారు. పండుగ నాడు ఎట్లైన మేకపోతును కోయాల్సిందేనని ఎక్కువ ధరలు పెట్టైన కొనుగోలు చేస్తున్నారు.

జతకు రూ. 25 వేల నుంచి 30 వేలు

సామాన్య ప్రజలు మటన్ తినాలంటే భయపడే విధంగా గొర్రెలు, మేకపోతుల ధరలు పెరుగుతున్నాయి. 10 నుంచి 15 కిలోలు మటన్ వచ్చే మేకపోతు గతంలో రూ. 6 నుంచి 8 వేల ధర పలికేది. ప్రస్తుతం ధరలు డబుల్ అయ్యాయి. గతంలో జత మేకపోతులను రూ.15 నుంచి 17 వేల మధ్య విక్రయించగా ప్రస్తుతం 25 నుంచి 30 వేల మధ్య విక్రయిస్తున్నారు. ఇక అంగళ్లలో దళారుల దందా జోరుగా సాగుతోంది. పెంపకందారుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి కొనుగోలుదారులకు ఎక్కువ అమ్మడంలో దళారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

కళకళలాడుతున్న అంగళ్లు..

దసరా పండుగ వస్తుండడంతో ఏ అంగడి చూసినా గొర్రెలు, మేకలతో సందడితో కనపడుతోంది. గొర్రెలు, పొట్టేళ్లు, మేకపోతుల హవా కనపడుతోంది. మండలకేంద్రాలు, వాటి చుట్టు పక్కల గ్రామాల నుంచి సంతలకు ముందస్తుగా వెళ్లి మేకపోతును కొనుగోలు చేస్తున్నారు. జనగామ జిల్లాలోని లింగాలఘణపురం మండలంలో జీడికల్‌లో(శనివారం), నర్మెట మండలకేంద్రంలో(బుధవారం)బచ్చన్నపేట మండల కేంద్రంలో(ఆదివారం), పాలకూర్తి మండలకేంద్రంలో (సోమవారం), రఘునాథ్‌పల్లి మండలకేంద్రంలో (గురువారం), చిలుపూరు మండలకేంద్రంలో(ఆదివారం), జఫర్‌గడ్ మండలకేంద్రంలో(శుక్రవారం) ప్రతీ వారం సంతలు నడుస్తున్నాయి. కొందరు సంతలకు వెళ్లి ధరలు ఎక్కువగా ఉండడంతో తిరిగి వస్తున్నారు. మరికొందరు గొర్రెల, మేకల పెంపకందారుల వద్దకే వెళ్లి బ్యారం చేస్తున్నారు. వారి దగ్గర కూడా ధరలు ఎక్కువగానే ఉంటున్నాయి. ధరలు ఎందుకు ఇంతగా పెరిగాయని పలువురిని అడుగగా మటన్ తినేటోళ్లు ఎక్కువయ్యారు. పెంపకందారులు తక్కువ ఉండడం వల్లే మటన్‌కు డిమాండ్ పెరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ధరలు పెరిగాయి: ప్రజ్ఞాపురం నర్సింహులు



నేను నర్మెట అంగడికి గొర్రెనైనా, మేకపోతు కొందామని వెళ్లాను. ధరలు ఎంతున్నాయని అడిగితే 10 కిలోల మటన్ వచ్చే మేకపోతుకు రూ. 10వేలుఅని చెప్పారు. కిలో మటన్‌కు రూ. 1000 పడుతుంది. ధరలు మండుతున్నాయి. అంగడి కంటే పెంపకందారుల వద్ద కొనుగోలు చేద్దామని తిరిగివచ్చా.





ప్రమాదపుటంచున ప్రయాణం



గీసుగొండ నుంచి పోతురాజుపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయ బావి పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా ఉంది. బావి పక్కనే ఉన్న రోడ్డుపై బుంగ పడి ఆందోళన కరంగా ఉంది. ప్రయాణికులు ఎవరైనా అటువైపు నుంచి వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బావిని, రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గుంటగుంటకు సర్వే సాధ్యమేనా..?

● డిజిటల్ క్రాప్ సర్వేపై ఏఈవోల ఆందోళన ● ఉన్న సిబ్బందితో పనిచేయడం కుదరదని నిరసన
● ఏజెన్సీల ద్వారా సర్వే చేపట్టాలని విజ్ఞప్తి ● 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

హసన్‌పర్తి, అక్టోబరు 6: రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వేను ఏఈవోలు బహిష్కరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఏఈవోలపై ఒత్తిడి తేవడంపై 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నిరసనలో భాగంగా జిల్లా వ్యవసాయాధికారులు, జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ని కలిసి విస్తరణాధికారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

పని ఒత్తిడితో సతమతం

ఇప్పటికే గ్రామ స్థాయిలో సహాయకులు లేకున్నా వ్యవసాయ విస్తరణాధికారులు ఏడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే రైతు బంధు, రైతు బీమా వంటి 49 రకాల విధులు నిర్వహిస్తూ సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో డీసీఎస్ విషయంలో సాగులో ఉన్న కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూములలో ప్రస్తుతం ఉన్న 26 వందల మంది ఏఈవోలతో డిజిటల్ క్రాప్ సర్వే చేయించాలని చూడడం సరికాదని ఏఈవోలు అంటున్నారు. కాగా, ఈ సర్వే కోసం 12 వేల మంది సిబ్బంది అవసరం ఉంటుందని, కానీ కేవలం 26 వందల మంది వ్యవసాయ విస్తరణాధికారులతోనే సర్వే చేయించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు.

వేధింపులు

ఒక రైతుకు తనకున్న వ్యవసాయ భూమిలో వేసున్న పంటల నమోదులో గుంటగుంటకు సర్వే చేసి రిపోర్టు ఇవ్వడం విస్తరణాధికారులకు సాధ్యమయ్యే పనికాదన్న విమర్శలున్నాయి. 60 శాతం మహిళా సిబ్బంది ఉన్న ఈ శాఖలో ప్రతీ గుంటకు ఫొటో క్యాప్చర్‌తో పాటు పంట నమోదు, ఇతర వివరాలను నమోదుచేయడం సాధ్యమయ్యేపని కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే డిజిటల్ క్రాప్ సర్వే సమస్యకు పరిష్కారం చూపకుండా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు హాజరవుతున్నప్పటికీ వారికి సాధారణ సెలువుగా పరిగణిస్తూ మెమోలు జారీ చేస్తున్నారని తలలు పట్టుకుంటున్నారు.


మంత్రి తుమ్మలకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జాక్ నేతలు

రాష్ట్ర వ్యాప్త నిరసనలు

రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేపై తీసుకున్న నిర్ణ యంతో ఏఈవోలపై అదనపు పనిభారం పడుతోందని, వెంట నే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రైవేటు ఏజెన్సీ ల ద్వారా సర్వే పనులు చేయించాలని కోరుతూ ఏఈవోలు రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏఈవోల సమస్యను పట్టించుకోకుండా జాప్యం చేస్తుండడంతో నిరసనలు 17వ రోజుకు చేరుకున్నా యి. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఆందోళనలు తీవ్రం కాకుండా వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని జాక్ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఏజెన్సీకి అప్పగించాలని డిమాండ్

కేంద్ర ప్రభుత్వ విధివిధానాల ప్రకారం ప్రతీ రాష్ట్రం వివిధ ఏజెన్సీల ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బంది పర్యవేక్షణలో ఈసర్వేలు చేయించాల్సిందిగా ఆదేశాలు న్నాయి. ఆ ప్రకారమే మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిస్సా వంటి రాష్ట్రాలలో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వేలు కొనసాగుతున్నాయి. కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే చాలీచాలని ఏఈవోలతో ఈ సర్వే నిర్వహించాలని చూడడం పట్ల తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏజెన్సీల ద్వారా వివిధ రాష్ట్రాలలో చేపడుతున్న సర్వే వివరాలను ఇప్పటికే వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులకు, కలెక్టర్లకు, ప్రభుత్వ ప్రతినిధులకు, వ్యవసాయ శాఖ మంత్రికి, డైరెక్టర్‌కు వివరించినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఏఈవో జాక్ నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలపై పెరుగుతున్న ఒత్తిడిపై సానుకూల దృక్పథంతో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వే నిర్వహించి ఏఈవోలపై పనిభారాన్ని తగ్గించాలని జాక్ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఎస్సారెస్పీ కెనాల్‌కు బుంగ

టెక్స్‌టైల్ పార్కు ముప్పు

ఎస్సారెస్పీ ప్రధానకాలువతో పాటు ఉపకాలువలకు నీరు వదలటంతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ప్రధాన కాలువ వద్ద పలుచోట్ల బుంగలు ఏర్పడ్డాయి. దీంతో కాలువ స్లైనింగ్ శిథిలమై కాలువలో ప్రవహించే నీరు బయటికి వచ్చే ప్రమాదం పొంచి ఉంది. నీటి ప్రవాహం పెరిగితే టెక్స్‌టైల్ పార్కులోకి కాలువ వరద నీరు చేరే అవకాశం ఉంది. ఇక్కడే కాకతీయ కెనాల్ పొడువునా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం ఇదేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే స్థానిక రైతులు కోరుతున్నారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.


వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.


కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

సీతాఫలం.. యమ పిరం..

● నగరంలో కిలో రూ.200పైనే.. ● ఇబ్బందుల్లో వినియోగదారులు


హనుమకొండలో రోడ్డు పక్కన సీతాఫలాలను విక్రయాలు చేస్తున్న ప్రజలు

బాలసముద్రం, అక్టోబరు 6: శీతాకానికి ముందే సీతాఫలాలు నగరానికి చేరుకున్నాయి. ప్రతీ సంవత్సరం శీతాకాలంలో మూడు నెలల పాటు సీతాఫలాల విక్రయాలు నగరంలో జోరుగా సాగుతుంటాయి. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్, నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు సీతాఫలాలను డబ్బాలలో పెట్టి విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సీతాఫలాల విక్రయాలు మొదలయ్యాయి. బుధవారం పండ్లు కొనుగోలు చేయడానికి ఆయా ప్రాంతాలకు వచ్చిన ప్రజలు ధరలను చూసి వెనుదిరిగారు. ప్రస్తుతం సీతాఫలాలు ధరలను చూసి బెంబెలెత్తిపోతున్నారు. మంచి ఫలాలకు కిలో ధర రూ.200 నుంచి రూ.250 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో కొందరు కొనుగోలుదారులు వారు అడిగిన కాడికి ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి నగరానికి..

సీతాఫలాలను జనగామ జిల్లా, సిద్దిపేట, ఇతర జిల్లాల నుంచి ఎడ్ల బండ్లు, ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. సీజన్ కావడంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ముందుకొచ్చినప్పటికీ ధరలను చూసి జంకుతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండాల్సిన ధరలు ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం సీతాఫలాలకు డిమాండ్ పెరిగిందని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ఒకవైపు అధిక వర్షాలు కురువడంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సీతాఫలాలను కొంత మంది సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలు పెంచి విక్రయాలు జరుపుతున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. చిన్న సైజు ఉన్న సీతాఫలాలు కిలోకు రూ.150 ఉండగా, పెద్ద సైజులో ఉన్నవి కిలో ధర రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతోంది.

కూనూరు పాఠశాలలో బతుకమ్మ సందడి



కూనూరులో బతుకమ్మ ఆట పాటలతో పూర్వ విద్యార్థినుల (మహిళల) సందడి

జఫర్‌గఢ్, అక్టోబరు 6 : మండలంలోని కూనూరులో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి బ్యాచ్ 1974లో ఆరంభమై 2024 నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాటి నుంచి టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులంతా సంఘటితమై సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణలో భాగంగా శనివారం హైస్కూల్ ఆవరణలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన పాఠశాల టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థినులు (మహిళలు) కూనూరుకు చేరుకుని స్థానిక మహిళలతో కలిసి సాయంత్రం నుంచి రాత్రి వరకు బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. మండల కేంద్రంలో స్థానిక దుర్గాదేవి అమ్మవారి మండపం వద్ద ఆర్యవైశ్య మహిళలు వివిధ రకాల పూలతో పెద్ద బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు

మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలి

జనగామ రూరల్, అక్టోబరు 6: జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియాన్ని అభివృద్ధి పరిచి సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి అన్నారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని 16వ వార్డు సంజయనగర్‌లో సీపీఎం పార్టీ ప్రథమ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంజయనగర్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. వెంటనే స్టేడియాన్ని అభివృద్ధిపరిచి సెక్యూరిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కొమ్ముగాని రాజు, బొట్ల శేఖర్, ప్రకాష్, బాల్నె వెంకటమల్లయ్య, బండ సౌందర్య, కొడియాల అంజమ్మ, రాజు, పద్మ, సునీత, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంజయనగర్ నూతన కార్యదర్శిగా కళ్యాణం లింగం, సహాయ కార్యదర్శిగా కొడిదాల అంజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు..

డీజేల పై నిబంధనలు ఎత్తివేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6: డీజేల పై విధించిన నిషేదాన్ని ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డీజే సౌండ్స్ వ్యాపారుల, కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు భూక్య సురేష్ కోరారు. డీజేల పై విధించిన నిషేదంను ఎత్తివేయాలని కోరుతూ వ్యాపారులు, కార్మికులు డివిజన్ కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద కార్మికులు ఆదివారం చేబట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేదం ఎత్తివేయాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలో తలపెట్టిన సమావేశానికి కార్మికులు తరలివెళ్లారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు కేశోజు భీష్మాచారి, రజాక్, లింగమూర్తి, గోరంతల రాజు, నీల రాకేష్, మజర్, నాగరాజు, వికాస్, పవన్, సాంబ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



చెక్కు అందజేస్తున్న నాగపురి కిరణ్‌గౌడ్

తరిగొప్పుల, అక్టోబరు 6: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన యువతి జొన్నగోని సృజన గత కొన్ని రోజులుగా తుంటి ఎముక సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. డాక్టర్లు వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చవు తోందనడంతో బాధిత కుటుంబ సభ్యులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్ కుమార్ గౌడ్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ. 5 లక్షల ఎల్‌వోసి మంజూరి చేయించి ఆధివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల నాయకులు బైకని బాలరాజు గౌడ్, ఎంప్టీ యాకూబ్, కొయ్యడ రాజు, దామెర థామస్, చిలువేరు సంపత్, అర్జుల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు కుంకుమార్చనలు

బచ్చన్నపేట, అక్టోబరు 6:దేవీశరన్నవ ఉత్సవాలు మండలంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆలీంపూర్‌లో మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. సాల్వాపూర్‌లో అమ్మవారికి మాజీ ఎంపీటీసీ గూడెపు లతాశ్రీతిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో అమ్మవార్లకు ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



కోదండ రాంతో కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి, అక్టోబరు 6: వరంగల్ నుండి హైదరాబాద్ వెళ్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్, భాస్కర్, గాదె మహేందర్ రెడ్డి, రంగు రాజు, అల్లిబిల్లి కృష్ణ, జీడికంటి రాజ్‌కుమార్, శ్రీహరి, కిషన్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై ఆరు తరాల బలగం



ఆరు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకే వేదికపై ఉన్న దృశ్యం

బచ్చన్నపేట, అక్టోబరు 6: సమాజంలో రోజు రోజుకు బంధాలు, బంధుత్వాలు పలుచబడుతున్న ప్రస్తుత తరుణంలో బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన బోడకుంటి వంశీయులు ఆరు తరాలకు చెందిన కుటుంబాల సభ్యులు ఆదివారం ఒకచోట చేరి సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. శాసనమండలి మాజీ చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, బోడకుంటి మల్లయ్య, రాములు, ప్రభాకర్ తదితర కుటుంబాలకు చెందిన వారు అత్యంత ఆనందోత్సాహాల మధ్య ఉద యం నుంచి రాత్రి వరకు శ్రీనిధి గార్డెన్‌ను వేదికగా చేసుకుని గడిపారు. ఇందులో 300 మంది ఆరు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఒకే రక్తం పంచుకున్న ఆకుటుంబాలు గతంలో ఒకరిద్దరు మధ్య బేదాభిప్రాయాలున్నా అంతా కలిసిపోయి ఆత్మీయతతో అల్లుకుపోయారు. ఈ సందర్భంగా మాజీ చీఫ్ విప్‌వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరు తరాలకు చెందిన కుటుంబాల సభ్యులంతా ఒకే వేదికపై కలుసుకోవటం ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు అలరించాయి. కార్యక్రమంలో బోడకుంటటి శ్రీనివాస్, క్రాంతికుమార్, అనిల్, శశిధర్, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో పాలకులు విఫలం

జఫర్‌గఢ్, అక్టోబరు 6 : నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య విమర్శించారు. ఆదివారం మండలంలోని కూనూరులో యాట మల్లయ్య అధ్యక్షతన సీపీఎం గ్రామ శాఖ మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ ధరలు నానాటికి విపరీతంగా పెరుగుతూండడంతో కార్మికులు, సామాన్య మధ్య తరగతి ప్రజలు జీవనంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు. దేశంలో మానవ హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం వాటిల్లుతోందని, కవులు, కళాకారులపై నిర్బంధం పెరిగిందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా సీపీఎం పోరాటం సాగిస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి సమిష్టిగా పాటుపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండాయేనని ఆయన అన్నారు. కాగా, మహాసభకు ముందు పార్టీ జెండాను సోమయ్య ఆవిష్కరించారు. సీపీఎం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా శాగ యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం ప్రతినిధులు శాగ శ్రీను, ఓరుగంటి తిరుపతి, నాగరాజు, నరేశ్, లక్ష్మీ, వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నెమలిగొండ గౌడ సంఘం అధ్యక్షుడిగా శంకర్

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6: మండలంలోని నెమలిగొండ గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా మినుముల శంకర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం గ్రామంలో జరిగిన గీత కార్మికుల సమావేశంలో గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మినుముల శంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి యాదగిరి, ప్రధానకార్యదర్శిగా కోతి తిరుపతి, కోశాధికారిగా బత్తిని సత్యం, కార్యదర్శిగా కోల తిరుపతిలు ఎంపికయ్యారు.

ఝాన్సీరెడ్డికి నాయకుల పరామర్శ



ఝాన్సీరెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

పాలకుర్తి, అక్టోబరు 6 : పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆదివారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకు లు బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ సర్పంచులు వీరమనేని యాకాంతరావు, జల్గం కుమారస్వామి, పోగు శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు గడ్డం యాకసోమయ్య, కారుపోతుల శ్రీనివాస్ పరామర్శించారు.

ముస్లిం నాయకుల నిరసన

జనగామ కల్చరల్, అక్టోబరు 6: మహ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని జామియా మజీద్‌లో పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు. అక్కడ నుంచి పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి పోలీసులకు పిర్యాదు చేశారు. అనంతరం ముస్లిం మైనారిటీ నాయకులు జమాల్ షరీఫ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ దస్నాదేవి ఆలయ పూజారి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఈ వ్యాఖ్యల వల్ల ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో రఫే మతిన్, షకీల్, రహీం, మౌలానా షకీర్ సాబ్, యాకూబ్, లతీఫ్ షరీఫ్ పాల్గొన్నారు.

బాల్య స్నేహితుల ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న బాల్య స్నేహితులు

కొడకండ్ల, అక్టోబరు 6 : మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో తమతోపాటు 1992 బ్యాచ్ పదవతరగతి చదువుకున్న బొల్లోజు కృష్ణ ఇటీవల అనారో గ్యం తో మృతి చెందారు. విష యం తెలిసిన బాల్యస్నే హితులు కష్టాల్లో ఉన్న కుటుంబాన్ని పరామ ర్శించి తలాకొంత వేసుకుని మొత్తం 60,500 రూపాయలు ఆ కుటుంబానికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాము లక్ష్మీనారాయణ, బొల్లోజు ఉపేంద్రచారి, దయాకర్, కడారి వెంకన్న, రూపాని లింగయ్య, ఎస్‌కె యాకూబ్ పాషాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6: మండలంలోని తాటికొండ గ్రామంలోని కనకదుర్గా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, నిత్యహోమం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పండుగ రాజేశ్వర్, బుచ్చయ్య, కనకయ్య, నారబోయిన గోపాల్, రాములు, నాగరాజు, ఉప్పలయ్య, రాంబాబు, వికాస్, సత్తయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

నర్మెట, అక్టోబరు 6 : రైతుల కళ్లలో అనందం నింపడానికి దేశంలోని రైతుల ఖాతాల్లో 18వ విడత పీఎం కిసాన్ నిధులను వేసిన సందర్భం గా ఆదివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి ధరావత్ రాజు, మండల అధ్యక్షుడు రంగు మురళి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి రాజబోయిన శ్రీనివాస్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు బిచ్చాల కొమురెల్లి, మండల సభ్యత్వ కన్వీనర్ సొక్కం అనిల్, నాయకులు కొన్నె రాజు, జహంగీర్, మెతుకు సిద్దులు. గాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : ప్రధానమంత్రి కిసాన్ 18న విడుత నిధులు మంజూరు చేయడంతో ఆదివారం మండలంలోని ఈరవెన్ను గ్రామంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, మారం రవి, కొడిశాల యాదగిరి, సుధాకర్, వేల్పుల దేవరాజ్ ఉన్నారు.

రికార్డుల ప్రకారమే ప్రహరీ నిర్మించాలి

- శ్రీపతిపల్లి గ్రామస్థుల డిమాండ్

చిలుపూర్, అక్టోబరు 6 : రెవెన్యూ రికార్డుల్లో నమోదైన ప్రకారమే సహకార సొసైటీ స్థలానికి ప్రహరీగోడ నిర్మించాలని మండలంలోని శ్రీపతిపల్లి గ్రామస్థులు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సహకార సొసైటీ భవనం ఆవరణలో చేపడుతున్న ప్రహరీ నిర్మాణ సమాయాత్త పనులను వారు అడ్డుకున్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ గుగులోతు ఉమ్లానాయక్‌తో పాటు, పోలబోయిన నరేష్, కేశిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మోతె మహేశ్‌తో కాసేపు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీష్ మాట్లాడారు. సహకార సొసైటీ భవనం ఆవరణలో చేపడుతున్న ప్రహరీ పనులకు తాము వ్యతిరేకం కాదని, జీపీ రికార్డుల ప్రకారమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు పోలబోయిన జోగులు, ఎస్కే యాకూబ్‌పాషా, నీల కరుణాకర్, బాపురాజు, శ్రీకాంత్, రజనీకాంత్, పల్లపు రవి, మహేశ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

కొడకండ్ల, అక్టోబరు 6 : మండలంలోని లక్ష్మక్కపెల్లిలోని ఎస్ఎస్ 20-25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళినట్లు ఏఈ రాములు తెలిపారు. గత 7,8 నెలల కా లంలోనే లక్ష్మక్కపెలి లో ట్రాన్స్‌పార్మర్లను ఎత్తుకెళ్ళడం ఇది నాల్గో సారి అన్నారు. పోలీస్‌స్టేషన్లో పిర్యాదుచేయనున్నట్లు ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమ్మేళనమైన పూర్వవిద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6: డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2011-13 విద్యా సంవత్సరంలో ఇంటర్ మీడి యట్ పూర్తి చేసుకున్న సైన్స్ విభాగం పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో సమ్మేళనం అయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 10 ఏళ్ల తరువాత కలుసుకొని మురిసిపోయారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ సాంబ మూర్తి, అధ్యాపకులు భగీరథ్, దివాకర్, శ్రీనాథ్ పటేల్, విద్యార్థులు శివ, రమేష్, అనిల్, పరిపూర్ణచారి, మౌనిక, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 25 ఏళ్ల క్రితం పాఠశాలలో కలిసి చదువుకున్న 1998-1999 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి నాటి మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. సమావేశంలో చదువు చెప్పిన నాటి ఉపాధ్యాయులు ఎండి.దస్తగిరి, బైరి నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, తదిత ర గురువులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నర్మెట, అక్టోబరు 6 : మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బైరగోని రవి(47) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. కాగా మృతుడి కుటుంబాన్ని మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ. 20 వేలు, ఉమ్మడి మండల కన్వీనర్ రూ. 10 వేలు, మండల అధ్యక్షుడు చింతకింది సురేష్ రూ. 5వేలు, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ రూ. 2500, కంతి రాజలింగం రూ. రూ. 5 వేలు, వెల్దండ మాజీ సర్పంచ్ నర్ర వెంకటరమణరెడ్డి రూ. 5వేలు, మంకెన ఆగిరెడ్డి రూ. 2500, నర్మెట గ్రామ శాఖ అధ్యక్షుడు రూ. 2వేలు మొత్తం రూ. 52 వేలు ఆర్థిక సహాయం అందించారు.

●చిలుపూర్ : మండలంలోని రాజవరంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జక్కుల కొమురయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఎమ్డీ యాకూబ్‌పాషా, రంగు రవి, ఎమ్డీ అసద్ సందర్శించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సాయంగా రూ 5 వేల నగదును వారికి అందజేశారు. అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీనివాస్, బైరగోని మల్లయ్య, మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపులు మూసివేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

జనగామ కల్చరల్, అక్టోబరు 6: గ్రామాల్లో బెల్టుషాపులు మూసివేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జనగామ మండలం మరిగడిలో సీపీఎం గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా కనకారెడ్డి జెండావిష్కరణ చేసి బోడ రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు షాపులు ప్రజలకు శాపంగా మారాయని, దీంతో ప్రజలు ఆర్థికంగా తీవ్ర నష్టపోతున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సల్లూరి అశోక్‌ను పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. గ్రామంలో రెండు నూతన కమిటీలను ఎన్నకోగా 1వ శాఖ గ్రామ కార్యదర్శిగా కూరాకుల శ్రీను, సహాయ కార్యదర్శిగా బాల్నె శ్రీకాంత్, 2వ శాఖ కార్యదర్శిగా దండు శ్రీను, సహాయ కార్యదర్శిగా బండి చందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, మండల కార్యదర్శి బోడ నరేందర్, మాజీ సర్పంచ్ మీట్యా నాయక్, నాయకులు బాల్నె కిష్టయ్య, బోడ లక్ష్మయ్య, మచ్చ నారాయణ, కూరాకుల సమ్మయ్య, కాసాని మల్లేష్, మచ్చ పాండు, కాసాని సిద్దులు, సాంబరాజు మల్లేష్, కిషన్, సాంబరాజు పెద్ద సంపత్, సాంబరాజు చిన్న సంపత్, బోడ పవన్, బోడ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం యశస్వి స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, అక్టోబరు 6: ఓబీసీ, ఈబీసీ, డీనోటిఫైడ్ (సంచార తెగల)కు చెందిన విద్యార్థుల నుంచి పీఎం యశస్వి స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో వైఈటీ డాట్ ఎన్‌టీఏ డాట్ ఏసి డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94928 80366 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

జనగామ కల్చరల్, అక్టోబరు 6: మల్టీపర్పస్ విదానం రద్దు చేసి వేతనాలు పెంపుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు రాపర్తి రాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 7న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే దర్నాను జయప్రదం చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు జీపీ ఉద్యోగ కార్మికులు జయప్రదం చేయాలని కోరారు.

గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరి



యాదగిరి గౌడ్

జనగామ కల్చరల్, అక్టోబరు 6: తెలంగాణ రాష్ట్ర గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జనగామకు చెందిన కుర్రెముల యాదగిరి గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని నీరా కేంద్రం బాంక్వెట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. కాగా జిల్లా నుంచి యాదగిరి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల గోపా జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు, గూడ రాజు, బోసు, కన్నా పరశు రాములు, పెద్ది వెంకట నారాయణ గౌడ్, దేశగాని నాగరాజు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన యాదగిరి గోపా వ్యవస్థాపక కార్యదర్శిగా 2002నుంచి పని చేస్తూ వివిధ పదవీ బాధ్యతలు నిర్వహించి గుర్తింపు పొందారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా మధు



మధు

నర్మెట, అక్టోబరు 6 : ముదిరాజ్ సంఘం నర్మెట గ్రామ అధ్యక్షునిగా పులి మధును ఆ సంఘ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా పులి మధు మాట్లాడుతూ తనపై నమ్మకంగా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి కొరకు, ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన నేతలు

బచ్చన్నపేట, అక్టోబరు 6:బచ్చన్నపేట ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎస్‌కే హమీద్‌ను ఆదివారం మాజీ మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షులు సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నద్ది సోమిరెడ్డి, మండల నాయకులు ఎస్ఐని కలిసి సన్మానించారు.

మార్కండేయ ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న బత్తుల ప్రభాకర్

చిలుపూర్, అక్టోబరు 6 : మండలంలోని చిన్నపెం డ్యాల లో వచ్చే నెల 16 నుంచి నిర్వహించనున్న మార్కండేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల నిర్వహణకు గాను, రాజవరం గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకర్ - ప్రతిమ దంపతులు రూ 10 వేల నగదును విరాళంగా అందజేశారు. ఆదివారం కమిటీ ప్రతినిధులు పేరాల రాజమౌళి, బత్తుల రాజన్‌బాబు నేతృత్వంలో పలువురు ఆయనను కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరాల చంద్రమౌళి, కుమారస్వామి, మంద రాజమౌళి, రాజు, వడ్డెపల్లి యుగంధర్, కనుకుంట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో చెట్ల తొలగింపు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 6: మండలంలోని తాటికొండ గ్రామం నుంచి కొత్తపల్లి, ఘన్‌పూర్ దేవాదుల రిజర్వాయర్ వరకు రోడ్డు వెంట ఏపుగా పెరిగిన చెట్ల పొదలను మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి సొంత ఖర్చులతో తొలగించే పనులను ఆదివారం ఆటో యూనియన్ కార్మికులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న ఆటో యూనియన్ అధ్యక్షుడు మారపాక కుమార్ మాట్లాడారు. గత కొన్ని నెలలుగా రోడ్డు వెంట రెండు వైపుల చెట్ల పొదలు భారీగా పెరుగడంతో పాటు మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొందనిఅన్నారు. విషయాన్ని మాజీ వైస్ ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జేసీబీతో పనులను ప్రారంభించారని తెలిపారు. ఎమ్డీ సాజిద్, బిట్ల నరేష్, మారపాక స్వామి, శ్రీను, వీరస్వామి, ప్రేమ్‌కుమార్, ఎజాస్, పరుశరాం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి 'ఆదర్శ' విద్యార్థులు

- అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

జఫర్‌గఢ్, అక్టోబరు 6 : మండల కేంద్రమైన జఫర్‌గఢ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన టి.చరణ్, ఎం.లావణ్య (10వ తరగతి) అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జనగామలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో చరణ్; 400 మీటర్ల పరుగు పందెంలో లావణ్య ప్రతిభను కనబరిచి మొదటి స్థానాలు సాధించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకాంత్, పీఈటీలు బి.రాజు, ఎ.శ్రీనాథ్ ఆదివారం తెలిపారు. ఈనెల 7 నుంచి హన్మకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కాగా, రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, పీఈటీ అభినందించారు.

పార్టీని బతికించుకుంటున్నది మేమే..!

- ● మధ్యలో వచ్చిన వాళ్లే వెళ్లిపోయారు
- ● ఎమ్మెల్యేగా రాజయ్య చెప్పుడు మాటలకు ప్రాధాన్యతనిచ్చారు
- ● బీఆర్ఎస్ సమావేశంలో మనోగతాన్ని వెళ్లగక్కిన కార్యకర్తలు

లింగాలఘణపురం, అక్టోబరు 6: తెలంగాణ ఉద్యమ కాలం నుంచి వెనుదిరుగని పోరాటాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకున్న నిఖార్సయిన కార్యకర్తలుగా తామే బీఆర్ఎస్‌పార్టీని బతికించుకుంటున్నామని, మధ్యలో వచ్చిన వాళ్లు మాత్రమే పార్టీని వీడిపోయారని బీఆర్ఎస్ కార్యకర్తలు తమ మనోగతాన్ని వెల్లండించారు. ఆదివారం లింగాలఘణపురం మండలం నెల్లుట్ల శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తల సమావేశానికి మండల అధ్యక్షులు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఒక్కొక్కరుగా కార్యకర్తలు తమ మనోగతాన్ని నియోజకవర్గ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ముందు నిర్మొహమాటంగా వెళ్లగక్కారు. ఎమ్మెల్యేగా డాక్టర్ రాజయ్య పదేళ్లుగా అధికారంలో ఉండి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఎమ్మెల్యేగా కొద్దిమంది చెప్పుడు మాటలు వినడం వల్ల నిఖార్సయిన కార్యకర్తలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కష్టాలు, నష్టాలు తాము భరించామని పదవుల విషయానికి వస్తే తమను పట్టించుకోలేదన్నారు. అయినప్పటికీ తాము ఏనాడు కూడా దిగులు చెందకుండా పార్టీ బలోపేతానికి పాటుపడ్డామన్నారు. పదవుల ఆశతో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వచ్చి ప్రభుత్వంలో పదవులు అనుభవించిన వాళ్లే పార్టీని వీడిపోయారన్నారు. ఇప్పటికైనా పార్టీ కోసం పనిచేసే వాళ్లను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకునేందుకు అహర్నిషలు కృషి చేసామన్నారు. ఇప్పటికైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో, సంస్థాగత పదవుల పంపకాల్లో, చెప్పుడు మాటలకు ప్రాధాన్యత ఇవ్వకుండా గ్రామశాఖల తీర్మాణాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఒకరిద్దరు సీనియర్ కార్యకర్తలు భావోద్వేగంతో మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పిదాలను మాజీ ఎమ్మెల్యే రాజయ్య దృష్టికి ముక్కుసూటిగా తీసుకెళ్లారు.